
# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా,  తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ,  స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే  జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు..  ఈ మహానగరం కథలు..!!

# (కన్) ఫ్యూజన్

'కావ్య పండూ, శిరి పెళ్ళికి, నువ్వింకేమైనా కొనుక్కోవాలా?" అంది దమయంతి, కాలేజీకి బయలుదేరుతున్న కూతురు కావ్యతో.

"లేదమ్మా, అది ఈ పెళ్ళి చేసుకుంటుందో, లేదో తెలియదు, కాన్సిల్ చేసేస్తాను అంటోంది" అంది చాలా మామూలుగా.

"వాట్, కేన్సిలా? ఎందుకు? కేన్సిల్ చేసేస్తాను అనడమేమిటి? ఇదేమైనా మీటింగా, తనకిష్టమైనప్పుడు పెట్టుకోవడానికీ, లేనప్పుడు కేన్సిల్ చేసుకోవడానికీ" కంగారుగా అడిగింది దమయంతి.

" తెలీదమ్మా, రచిత్ నాకు సరిపోడు అంటోంది. వాళ్ళిద్దరికీ ఎక్కువగా అభిప్రాయాలు కలవడం లేదుట, వాడికీ, నాకూ పడదే ! అని మొన్నటినించీ రోజూ ఒకటే గొడవ, మోస్ట్లీ షీ విల్ కాల్ ద వెడ్డింగ్ ఆఫ్" అంది జుట్టు ఐరన్ చేసుకుంటూ.

"అన్నీ కుదిరి, ఇంత డేట్ ఇంత దగ్గరకు వచ్చాకా కేన్సిల్ అంటే ఏం బావుంటుంది?" తనలో తనే అనుక్కున్నాననుకుంటూనే పైకే అనేసింది దమయంతి.

"ఎవరికి బావుండాలి? అంది కావ్య కూడా అంతే సీరియస్ గా.

అలా అనేసి జుట్టు ఐరన్ చేసుకోవడం ముగించుకుని, ఒక కప్పుడు పాలు తాగేసి, రెండే ఇడ్లీలు తిన్నాననిపించి

" మరీ అంత నోరు తెరుచుకుని ఆలోచించకమ్మా, దాని లైఫ్, దానిష్టం, మధ్యలో మనమెవరం? నేను వస్తాను, క్లాస్ ఉంది" అంటూ వెళ్ళిపోయింది.

కావ్య వెళ్ళిన తర్వాత సోఫాలో కూర్చుని ఆలోచనలో పడింది దమయంతి.

శిరీష కావ్యకి చాలా క్లోజ్ ఫ్రెండ్, కావ్యకంటే దాదాపు రెండేళ్ళు పెద్దది, ఇంజనీరింగ్ చదివి ఉద్యోగం చేస్తోంది రెండేళ్ళుగా, ఇరవై మూడేళ్ళుంటాయేమో కావ్య బీ. టెక్ పూర్తి చేసి సిటీలోనే ఎం. బీ. యే చదువుతోంది. శిరీష వాళ్ళు కొంతకాలం ఇదే అపార్ట్ మెంట్ లో పక్కన బ్లాక్ లోఉండేవారు వాళ్ళు, ఈ మధ్యనే సొంత ఇల్లు కట్టుకుని వెళ్ళిపోయారు. కావ్య, శిరీష ఇద్దరూ ఒకే స్కూల్లో 12 వ తరగతి వరకూ చదివారు, అలా ఇద్దరూ ఒకే బస్సులో వెళ్ళడం తో మొదలయిన వారి స్నేహం వారితో పాటే పెరిగింది. శిరీష తల్లి రాధ దమయంతికి బాగా తెలుసు, పిల్లల మధ్యనున్నంత స్నేహం పెద్దల మధ్యన లేదు కానీ మంచి రిలేషన్ మాత్రం ఉంది. శిరీష నాన్న ప్రభాకర్ సొంత వ్యాపారం చేస్తారు, రాధ దగ్గరే ఉన్న స్కూల్లో ఆర్ట్ టీచర్ గా పని చేస్తుంది. వాళ్ళకి శిరీష, శిశిర్ ఇద్దరు పిల్లలు. శిశిర్ ఎన్. ఐ. టీ కురుక్షేత్రా లో చదువుకుంటున్నాడు.

"అమ్మా శిరికి పెళ్ళి తెల్సా? ఐ యాం వెరీ హేపీ" అని కావ్య నిన్ననే చెప్పినట్టుగా ఉంది, ఇంతలో ఏమయిందో? ఈ మధ్యన కుదిరిన పెళ్ళిళ్ళు అయ్యేవరకూ నమ్మకముండటం లేదు, అన్నీ సజావుగా జరిగినా ఎంతకాలం నిలబడతాయో ? అనేది అసలే తెలియడం లేదు. మేము జరిపించిన పెళ్ళిళ్ళు ఈ రోజుల్లో పిల్లలకి తెలిసి చేస్తున్నారా? తెలియక చేస్తున్నారా? తెలిసీ తెలియకుండానా? పాపం శిరీష వాళ్ళ అమ్మ రాధ ఎలా ఉందో?" అనుకుంటూ ఫోన్ చేసిందావిడకి.

" ఏం చేస్తాం దమయంతిగారు? అది వద్దని కూర్చుంది, నిన్నటివరకూ నచ్చినవాడు ఈ రోజు నచ్చలేదంటే ఏమనుకోవాలి? పోనీ సరి అయిన కారణం చెప్తుందా ? అంటే అదీ లేదు, ఇప్పుడేమీ అనకులే, రాత్రి మాట్లాడదాం అన్నారు వాళ్ళ నాన్న. పెళ్ళంటే నూరేళ్ళ పంట అనేవారు మన చిన్నప్పుడు, ఇప్పుడు వీళ్ళకిదో ఆటలా ఉంది" అంటూ గొడవ పెట్టింది.

" నిజమే రాధగారూ, చదువుల్లోనూ, వేసుకునే బట్టల్లోనూ రక రకాల చాయిస్ లు ఉన్నట్టే ఇదీ అనుకుంటున్నారు. మీరేమీ కంగారు పడకండి, ధైర్యంగా ఉండండి. రమ్మంటే మేమిద్దరం కూడా వస్తాము, అందరం కలిసి చెప్పి చూద్దాం శిరికి అంది " అనునయిస్తున్నట్టుగా.

ఆ విషయం తెలిసి రాత్రి కావ్య పెద్ద గొడవ చేసింది. " దాని విషయాల్లో మీరెందుకు తల దూర్చడం? దాని ప్రైవసీ అంతా మనం తినేస్తామా?" అంటూ.

"ఇదెక్కడి గొడవరా?, ఈరోజుల్లో పిల్లలతో అన్నీ గొడవలే, ఉద్యోగాలు చేస్తున్నా ఎక్కడా మెచ్యూరిటీ లేదు అనిపిస్తుంది వీళ్ళని చూస్తూ ఉంటే." అనుకుంది దమయంతి.

తానూ అదే లాజిక్ తానూ వాడుతూ " మేము దానితో మాట్లాడితే నీకెందుకు బాధ" అంది. కావ్య ఏమీ మాట్లాడలేదు.

" మా అంతగా మేము వెళ్ళములే, రాధా ఆంటీ రమ్మంటేనే వెళతాము, నువ్వేమీ బెంగ పెట్టుకోకు, నీకు శిరి ఫ్రెండ్ అయినట్టే నాకు రాధ ఫ్రెండ్ కాదా" అంది కొంచం గట్టిగా.

మర్నాడు శనివారం కావడాన అందరూ ఇంట్లో ఉన్నారు. రాధా వాళ్ళ కుటుంబాన్ని భోజనానికి పిలిచింది దమయంతి. "ఏమీ జరగనట్టు, తాను అనుకున్నదే వేదం అన్నట్టుగా ప్రవర్తిస్తున్న శిరిని చూస్తే ఒక పక్క చాలా ముచ్చటేసింది దమయింతికి ఆ పిల్లకున్న కాంఫిడెన్స్ చూసి, తన నిర్ణయం తప్పు కాదన్న ఆమె విశ్వాసం చూసి.

భోజనాలప్పుడు "వావ్! ఆంటీ చేమగడ్డల ఫ్రై చేశారా? నాకు చాలా ఇష్టం" అంది శిరి.

" అవునా, ఇంకొంచం వేసుకో అయితే" అంది దమయంతి.

" కానీ నిన్ననే కదా, ఈ మధ్య నాకు ట్రెడిషనల్ భోజనం ఇష్టం లేదన్నావుగా, ఎప్పుడు చూసినా పాస్తా, ఫాలాఫెల్ అంటున్నావు కదా" అంది కావ్య దెప్పుతున్నట్టుగా.

"నిజమే కావ్స్, నాకూ అదీ తినాలని ఉంటుంది, ఇదీ తినాలని ఉంటుంది. ఏం చెయ్యాలి చెప్పు ? అంది, నిన్న నాకు అస్సలు ట్రెడిషనల్ తినాలనిపించలేదు" అంది నవ్వుతూ.

" పోనీలే శిరీ, ఈ రోజు నీకు తినాలనిపిస్తోంది కదా, తినేసేయ్, కావలసినంత" అంది దమయంతి తనూ నవ్వుతూ.

" హడావిడిలో పిలిచాను కదా అని నేనేమీ పెద్ద గా స్పెషల్స్ చెయ్యలేదు, మామూలు మన తెలుగు భోజనమే, మీకు ఇష్టమవుతుందో లేదో అనుకుంటూనే వండాను" అంది దమయంతి.

" నాకెప్పుడూ మన వంటలూ, మన పద్ధతులే ఇష్టం, ఇదిగో పిల్లలకే ఎప్పుడేది ఇష్టమవుతుందో తెలీదు" అంది రాధ.

మగవాళ్ళిద్దరూ ముందు గదిలోకి నడిచారు భోజనాలు కాగానే. పిల్లలిద్దరూ కావ్య గదిలోకి పరిగెత్తారు. ఆడవాళ్ళిద్దరూ టేబిల్ దగ్గర మిగిలారు.

" ఇప్పుడు చెప్పండి రాధా, అసలేమంటుంది శిరి?" అంది రాధ చేతి మీద తన చేతిని వేస్తూ.

" ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో తెలియడం లేదు దమయంతిగారూ. శిరి గురించి మీకు తెలుసు కదా, ఎప్పుడూ బాగా చదువుకునేది, తన ఫ్రెండ్స్, పుస్తకాలు, మ్యూజిక్ ఇలా సరదాగా జీవితాన్ని ఎంజాయ్ చేసేది. మేము కూడా పిల్లలకి తగినంత స్వేచ్ఛ ఇచ్చి జాగ్రత్తగా పెంచాము. వాళ్ళ ఇష్టాలనెప్పుడూ గౌరవించాము, ఇంజనీరింగ్ అవగానే ఉద్యోగంలో చేరతాను, పైకి చదవను అని జాబ్ లో చేరింది. చేరిన కొన్నాళ్ళకి తను ఒక అబ్బాయిని ఇష్టపడ్డానని, అతను తనకి కాలేజీ రోజులనించీ ఫ్రెండ్ అని, ఇప్పుడు తన ఆఫీస్ లోనే పనిచేస్తున్నాడనీ చెప్పింది. . కాదంటే బాధపడతారు కదా, అందుకే పిలిచి మాట్లాడదాం" అన్నాము.

" వాడు అమెరికా వెళ్ళాడు, ప్రాజెక్ట్ పని మీద వచ్చాకా మాట్లాడదాం, ఇంతలో వాడు కూడా వాళ్ళ అమ్మా వాళ్ళకి చెప్తాడు అంది. ఇప్పుడంతా వాడు, అదీ, ఇలాంటి పిలుపులే కదా, అంది. సరే అన్నాము. " ఒకసారి మాట్లాడుకుందాం, తర్వాత డిసైడ్ చేసుకోవచ్చు అని మెల్లిగా చెప్పాము. తనమనసుని కష్టపెట్టి ఎప్పుడూ ఏమీ చెయ్యలేదు కదా.

ఇంతలో ఏమయిందో, ఏమో తెలీదు వాళ్ళకి వాళ్ళే మనిద్దరికీ కమిట్మెంట్ కుదరదు, ఫ్రెండ్స్ గా ఉంటే బెటర్ అనుకున్నారుట, ఆ మాట తనే చెప్పింది. "అదేమిటే ?" అని నేనేదో అనబోతే " మేం బాగానే ఉన్నామమ్మా, నాకేమీ బాధలేదు, నీకెందుకు వర్రీ?అంది పైగా.

ఎన్నో చెప్పాలని ఉన్న రాధకి అవన్నీ ఏ వరసలో చెప్పాలన్నది తెలియడం లేదు. హడావిడిగా చెప్పాలన్న ఆతృతలో పొలమారి దగ్గు వచ్చింది.

" ముందొక గ్లాస్ నీళ్ళు తాగండి" అంది దమయంతి. నీళ్ళు తాగి కళ్ళు , పేపర్ నేప్కిన్ తో తుడుచుకుని మళ్ళీ చెప్పింది.

" చూడు శిరీ, లైఫంటే ఆట కాదు, ఈ రోజొకటి, రేపొకటి అనుకోవడానికి, క్షణక్షణానికీ మార్చుకోవడానికీ, అవినాష్ నీకు సీనియర్, మీరిద్దరూ కొన్నేళ్ళనించీ ఫ్రెండ్స్. మొదటేమో పెళ్ళి అన్నావు, ఇప్పుడేమో కాదంటున్నావు? ఇలా ఎలా? నీకు తెలియదంటే ఒప్పుకోవు, చెప్పినది వినవు. అంటూ ఆ రోజు అనిల్ కోప్పడ్డారు శిరిని.

" ఓ డేడీ, మేము ఫ్రెండ్స్ మి కనకే మాకు బాగా తెలుసు. అందుకే వాడు మనం ఇలా ఫ్రెండ్స్ గా ఉంటే నే బెటర్ అనగానే నాకూ నిజమే అనిపించింది, లేకపోతే అలా అనిపిస్తుందా? వీ జెల్ వెల్ యాజ్ ఫ్రెండ్స్, అంతే" అంది తేలిగ్గా.

"పోనీలే రాధా, కనీసం ముందరే వాళ్ళిద్దరూ పెళ్ళి గురించి అలా నిర్ణయించుకున్నారు కదా, ఇదీ ఒకందుకు మంచిదే అన్నారు, అదే పెళ్ళి అయిన వెంటనే జరిగి ఉంటే ఎలా ఉండేదో ఆలోచించు " అన్నారు

అలా మేము అవినాష్ ని కలవకుండానే ఆ చాప్టర్ ముగిసింది.

అందమైన పిల్ల, చదువుకుంది, మంచి ఫేమిలీ అని తెలుసున్న వాళ్ళందరూ సంబంధాలు చెప్తూ ఉంటే మళ్ళీ శిరిని అడిగి, కనుక్కుని అన్ని వివరాలు బావున్నాయని మా అక్క వాళ్ళ ద్వారా వచ్చిన మంచి మేచ్ అని ఈ సంబంధం అనుకున్నాము. అప్పుడు శిరి కూడా అవునమ్మా, మీరెలా అంటే అలాగే చేస్తాను అంటే నేను చాలా పొంగిపోయాను కూడా.

రెండు కుటుంబాలూ కలిసి నాలుగు నెలల క్రితం ఈ సంబంధం కుదుర్చుకున్నాం. రచిత్ మంచి అబ్బాయి, అన్నీ తెలిసిన వాడు, శిరిలా కాకుండా బేలన్స్ డ్ గా ఉంటాడు. ఇద్దరూ ఫోన్లలో మాట్లాడుకునేవారు, తరచూ కలిసేవారు. అన్నీ బావున్నాయి, అంతా బాగా జరుగుతోందనుకుంటే ఇప్పుడిలా మొదలు పెట్టింది. అన్ని ఏర్పాట్లూ చేసుకున్నాం, హాల్ బుక్ చేసుకున్నాం, కార్డ్ లు కూడా ఇవ్వాళో, రేపో వస్తాయి.

ఇప్పుడిలా ఏ కారణమూ చెప్పకుండా నాకిష్టం లేదు, ఐ యాం నాట్ ష్యూర్ అంటే ఏమనుకోవాలి? గట్టిగా బలవంతపెట్టి చెయ్యలేము కదా, అలా అని ఇంతదూరం వచ్చాకా నోరు మూసుకుని అదన్న ప్రతీ మాటకూ తాళం వేస్తూ కూర్చోలేము.

" నేనర్థం చేసుకోగలను రాధా మీరు చెప్పేది, కనీసం ఎందుకు వద్దనుకుంటోందో తెలిస్తే ఏదో ఒక ప్రయత్నం చెయ్యవచ్చు " అంది దమయంతి నెమ్మదిగా.

" అదే నా బాధ కూడా" అంది రాధ. "అలాగని చిన్నపిల్ల కాదు, చదువయ్యి బాధ్యతగా ఉద్యోగం చేసుకుంటున్న అమ్మాయి ఇలా బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తే ఎలా?" అంది ఆవిడ.

" మీరన్నవన్నీ నిజమే, కానీ వద్దనడానికీ, అనుకోవడానికీ ఏదైనా కారణం ఉండాలి కదా, అదే అడిగితే కనీసం ఎలా హేండిల్ చెయ్యాలో ఆలోచించవచ్చు. అబ్బాయి వాళ్ళతో ఇంకా ఏమీ అనలేదు కదా మీరు?" అంది దమయంతి.

" లేదు, లేదు. అదింకా బాధగా ఉంది నాకు, పాపం వాళ్ళేమో అన్నీ ఖరారు అయిపోయాయి కదా అని అన్ని సన్నాహాలూ చేసేసుకుంటున్నారు, అందరిని పిలిచేశారు, ఆ మాటకొస్తే మేమూ అంతే" అంది బాధగా.

" పోనీ కావ్యని అడగమంటేనో? వాళ్ళిద్దరూ బాగా స్నేహితులు కదా, ఏదైనా చెప్తుందేమో" ఆశగా అంది రాధ.

" నేను మీతో మాట్లాడతానంటేనే కావ్య నా మీదకి తాడెత్తున లేచింది, దాని లైఫ్, దానిష్టం అని, మరిప్పుడు తననే అడగమంటే ఏమంటుందో? నేను చెప్తే అసలు వినదు, వాళ్ళ నాన్నని అడగమంటాను, ఈ రోజు, రేపట్లో ఇది తేలిపోవాలి మరెవరికీ తెలియకుండా" అంది తను కూడా.

" పిల్లలింత ఫ్రెండ్స్ అయినా మనమెప్పుడూ వాళ్ళంత దగ్గరయింది లేదు, అయినా మీరింతగా పూనుకుని సహాయం చేస్తున్నారంటే ఏం చెప్పాలో నాకు తెలియడం లేదు" అంది రాధ కొంచం ఎమోషనల్ గా.

"అరే, అదసలు పెద్ద విషయమేమీ కాదు, మీరు ఇలా పాజిటివ్ గా స్పందించినందుకు నాకు చాలా సంతోషం గా ఉంది. నేను మొదట ఎంత సందేహించానో తెల్సా?" అంది తను కూడా.

అలా దాదాపు నాలుగవుతుండగా టీ తాగి వాళ్ళు ఇంటికి బయలుదేరారు.

ఆ రాత్రి కావ్య కీ వాళ్ళ నాన్నకీ చిన్నపాటి వాగ్యుద్ధం జరిగింది శిరిని ఆ మాట అడగమనే విషయం మీద.

" నో డేడీ, ఐ కాంట్ డూ దట్. అది చెప్తే వింటాను కానీ, దాని పర్సనల్ విషయాల్లో నేను తల దూర్చను, అది మేనర్స్ కాదు, ఆ సంగతి మీకు కూడా తెల్సు " అంటూ మొదలు పెట్టిన కావ్యని చిన్న పిల్లని బ్రతిమాలినట్టు బ్రతిమాలి, బుజ్జగించి మెల్లిగా ఒప్పించాడు శ్రీనాథ్.

" నా కిష్టం లేని పని నాతో చేయిస్తున్నారు, అంకుల్ కూడా అడగమన్నారు అన్నారు కదా అని అడగడానికి ట్రై చేస్తాను" అంటూ లక్ష రకాలుగా గునిసి ఆఖరుకి ఒప్పుకుంది.

ఆ ప్లాన్ లో భాగంగా శిరి ని బయటకి తీసుకెళ్ళింది. ఆ ఆడపిల్లలిద్దరూ వెనక్కి వచ్చేవరకూ ఏం వినాల్సి వస్తుందా? అన్న టెన్షన్ తో గడిపారు పెద్దవాళ్ళు.

మధ్యాహ్నం మూడవుతుండగా వచ్చింది కావ్య.

" రాగానే దాన్నేమీ అడగద్దు, కొంచం రిలాక్స్ అయ్యాకా అడుగు, లేకపోతే అసలే ఏమీ చెప్పదు" అన్నాడు శ్రీనాథ్ ముందే, దాంతో తన ఆత్రుతకి కళ్ళెం వేయల్సి వచ్చింది దమయంతికి.

సాయంత్రం టీ తాగుతూ ఉండగా మెల్లిగా అడిగింది.

" కావ్యా, ఏమంది శిరి?" అని.

" ఓ, ఇట్స్ ఆల్ క్లియర్ మా, దానికి ఇద్దరిలో ఎవరంటే ఇష్టమో తేల్చుకోలేకపోతోంది" అంది కావ్య.

"అంతా క్లియర్ ఏమిటి? మళ్ళీ తేల్చుకోలేకపోవడం ఏమిటి? ఇద్దరెవరు? " అయోమయంగా అనుకుంది దమయంది. అవే మాటలు మెల్లిగా అడిగింది కావ్యని.

" రెండు కారణాలంటోందమ్మా, ఇంకా దానికే క్లారిటీ లేదనుకో. ఏది ఎక్కువ ముఖ్యం అనేది?

మొన్నెప్పుడో ఇది రచిత్ కి ఫోన్ చేసిందిట, అతనేమో తీరిగ్గా పొద్దున్నే కూర్చుని విష్ణు సహస్ర నామం వింటున్నాడుట.

దీనికది నచ్చక " అదేమిటి? అలా పాతకాలం పాటలా?" అందిట.

దానికి వాడు "ఇది పాట కాదు, పైగా పాతకాలంది అసలే కాదు, ఎవర్ గ్రీన్ ఇది. ఎం. ఎస్ సుబ్బులక్ష్మి గారి గొంతులో ఉన్న మేజిక్ అసలు అన్ బిలీవబుల్ "అన్నాడుట.

దానికి ఇది చాలా ఆశ్చర్యపోయిందిట. "ఇదేం టేస్ట్? " అని.

అతన్ని అడిగిందిట " ఎప్పుడూ చెప్పలేదేం? "అని.

దానికి అతను " మనమధ్యన ఇప్పటివరకూ ఆ టాపిక్ రాలేదు కదా, వస్తే చెప్పి ఉండేవాడిని. నేను ఎరిక్ క్లాప్టన్ ని ఎంత ఎంజాయ్ చేస్తానో, వీటిని కూడా అంతే, మ్యూజిక్ మ్యూజిక్ ఈజ్ ఆల్ అబవుట్ పర్సనల్ టేస్ట్ " అని. దాన్నించి ఇద్దరికీ చిన్న డిస్కషన్ అయిందిట. దాంతో ఇది చాలా అప్సెట్ అయింది. అంతే కాదు వాళ్ళిద్దరూ చదివే పుస్తకాలు వేరుట, ఫుడ్ కూడా అంది కావ్య.

ఇంకో విషయం తెల్సా? అదే రోజు అవినాష్ మొన్ననే మెసేజ్ పంపించాడు ట వాట్సాప్ లో, అప్పుడు అలా మనం వద్దనుకున్నప్పటికీ, ఇప్పటికీ నేను చాలా మారిపోయాను, ఐ థింక్ ఐ వాంట్ టూ స్పెండ్ మై లైఫ్ విత్ యూ అండ్ ఓన్లీ యూ" అని.

ఇప్పుడు చెప్పు అమ్మా, ఇలాంటి పరిస్థితుల్లో ఎవరైనా ఏం చేస్తారు?" సీరియస్ గా అడుగుతున్న కూతురిని చూస్తుంటే ఈ పిల్లకొచ్చిన 22 ఏళ్ళు ఎక్కడున్నాయా? అని వెతుక్కోవాలేమో అనిపించింది దమయంతికి.

పైకేమీ మాట్లాడలేదు. " ఒహో, అదా విషయం, చూద్దాం మరి ఏమవుతుందో? అంది పైకి. కావ్య సాయంత్రం బయటకి వెళ్ళాకా ముందు భర్తకి, తర్వాత రాధకీ ఫోన్ చేసి విషయం చెప్పింది. తాము అనుకున్నంత పెద్ద విషయం కాకపోవడంతో కాస్త ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పుడు అసలు సమస్యని ఎలా అధిగమించాలి? అన్నది ప్రశ్న అయింది.

" ఇవి మనకి పెద్ద విషయాలుగా అనిపించకపోవచ్చు కానీ వాళ్ళకి కాదేమో?" అంది రాధ అనుమానంగా.

" అదే నేను అనబోతున్నాను, ఇందులో ఒకటి కాదు, రెండు సమస్యలు అన్నాడు శ్రీనాథ్ కూడా.

టైము చూస్తే ఎక్కువ లేదు, మగపెళ్ళివారికి చెప్పలేదు. ఎలా అని తర్జన భర్జన పడసాగారు.

" నాకేమీ అర్థం కావడం లేదు, అంది రాధ. అలా అనకండి, ఎదో ఒక పరిష్కారం చూద్దాం అన్నాడు శ్రీనాథ్. శిరి తండ్రి అనిల్ మౌనంగా వింటున్నాడు. చివరికి రాధే అంది. ఏదయితే అయింది, మనమే మాట్లాడాలి, ఇది తొందరగా తేల్చుకోవాల్సిన విషయం, పెళ్ళంటే రెండు కుటుంబాలకి సంబంధించిన విషయం కదా, మనకే కాదు వాళ్ళకీ తెలియాలి, అసలా అబ్బాయి ఏమంటున్నాడో వీళ్ళిద్దరి మధ్యనా జరిగిన గొడవ తర్వాత. అంది రాధ.

మెచ్చుకోలుగా చూసింది దమయంతి, ఇంతవరకూ తామందరూ శిరి వైపునించే ఆలోచిస్తున్నారు, అక్కడ ఆ అబ్బాయి గురించి ఆలోచించింది రాధ ఒక్కర్తే.

"నిజమే, మీరొక పని చేయండి, ఏదైతే అయింది ఈ రోజు శిరి రాగానే అడగండి, ఇంక ఆలస్యం చేస్తే లాభం లేదు" అంది దమయంతి.

ఆ సాయంత్రం రాధ శిరిని అడిగింది. " శిరీ, నేను నీతో కొంచం మాట్లాడాలి, పెళ్ళి దగ్గరకొస్తోంది కదా తల్లీ, నీ మనసులో ఏముందో చెప్పు."

"మీ అందరికీ ఇదొక పెద్ద విషయమిపోయింది కదూ, నిన్న కావ్యని కూడా నాతో మాట్లాడమన్నారు," అంది శిరీష. " శిరీ, నువ్వేమీ చిన్న పిల్లవు కాదు, రచిత్ నీకు గత మూడు నెలలుగా తెలుసు, నువ్వు అన్నీ మాట్లాడాకానే ఇష్టపడ్డాకనే మేము మిగతా కార్యక్రమాలన్నీ జరిపించాము, ఇంతవరకూ వచ్చకా ఇలా అంటే ఏం బావుంటుంది?" అంది కోపంగా

"ఎవరికి బావుండాలి?, నాకే కదా? మిగిలిన వారి గురించి నాకేం సంబంధం?" అంది శిరీష కూడా అంతేకోపంగా.

" నిజం, నీకు బావుండాలి అందుకనే ఇంతకాలం మేమేనకుండా ఊరుకున్నాం, కానీ ఇంత దూరం వచ్చాకా ఇప్పుడది అందరికీ బావుండాలి, అన్నింటికీ బావుండాలి. వినడానికీ, చూడడానికీ, చెయ్యడానికీ" అంది రాధ విసురుగా

" నువ్వుండు రాధా, నేను కనుక్కుంటాగా" అంటున్న అనిల్ ని ఆపింది రాధ.

" ఇంక కనుక్కోవడాలేమీ లేవు, తేల్చుకోవడమే" అని శిరి వైపు తిరిగి

" చూడు శిరి, ప్రేమ పెళ్ళిళ్ళైనా, పెద్దలు కుదిర్చిన పెళ్ళిళ్ళైనా వెనక ఉన్న ఉద్దేశ్యం ఒకటే, ఇద్దరు వ్యక్తుల, రెండు కుటుంబాల సంతోషం, జీవితకాలపు స్నేహం. పెళ్ళి అంటే ఒక పెద్ద బాధ్యత, అంతేకానీ రోజుకోసారి మార్చుకోవడానికి డ్రస్ కాదు.

నువ్వూ, అవినాష్ ఒకరినొకరు ఇష్టపడినప్పుడు మేము ఒక్క మాట కూడా అనలేదు, అతన్నీ, అతని తల్లితండ్రులనీ కలిసి ఒకసారి మాట్లాడదాం అన్నాం, కారణమేదైనా అది జరగలేదు అతను నీ తల్లితండ్రులని కనీసం ఒక స్నేహితుడిగా కూడా కలవలేదు. ఇప్పుడు కూడా ఒక ఫోన్ కూడా చెయ్యలేదు, వాట్స్ ఆప్ లో మెసేజ్ పంపించాడంటున్నావు, అది ఎంత వరకూ అతను సీరియస్ గా ఆలోచించి ఇచ్చాడో? మీరిద్దరూ ఎంతకాలం ఆ మాట మీద ఉంటారో అన్నదానికి నమ్మకం ఉందా? కనీసం నీకైనా? ఆ అబ్బాయి చెడ్డవాడని నేను అనడం లేదు, మీ ఇద్దరికీ ఒకరి పై ఒకరికున్న అభిప్రాయంలో క్లారిటీ లేదు. అతని మెసేజ్ కి స్పందించి నువ్వైనా అతనికి ఫోన్ చేశావా? లేదు.

మంచి స్నేహితులు మంచి భార్యాభర్తలవుతారో లేదో నాకు తెలీదు,కానీ మంచి భార్యాభర్తలు మాత్రం ఖచ్చితంగా మంచి స్నేహితులవుతారు. ఇక్కడ పెళ్ళిళ్ళు స్వర్గంలో జరుగుతాయి, నూరేళ్ల పంటా లాంటి మాటలు నేను చెప్పను. ఆ మాటలతో రచిత్ నే చేసుకోవాలని కూడా నేను బలవంత పెట్టను. రెండు వేరువేరు ఇళ్ళళ్ళో పెరిగిన పిల్లల అభిరుచుల్లోనూ, అలవాట్లలోనూ ఎన్నో వ్యత్యాసాలుంటాయి, అవి ఎంతో పెద్దవి ఐతే తప్ప కలుపుకోవాలనుకుంటున్న బంధాలను విడతీసుకునేంత గొప్పవి కాదని నా ఉద్దేశ్యం. " నువ్వు ఆవకాయ తినలేదనో, నీలం రంగు దుప్పట్టా వేసుకోలేదనో రచిత్ నువ్వు అతనికి నచ్చటం లేదు అన్నాడనుకో? అది నీకు సిల్లీ గా ఉందా, బావుందా? ఆలోచించు. నువ్వు చెప్పిన కారణం అంతకంటే గొప్పదేమీ కాదు, అతనివీ, నీవీ అభిరుచులు వేరుగా ఉండవచ్చు కానీ కలిసి మెలిసి మీ ఇద్దరికీ కామన్ గా అభిరుచులు ఏర్పరుచుకోవచ్చు.

మా చిన్నప్పటి పద్ధతుల్లో మీరు పెరగాలని మేము ఎప్పుడూ అనుకోలేదు, మా అభిప్రాయాలని మీపై రుద్దలేదు. మారుతున్న కాలానికి తగ్గట్టుగానే మేమూ మారడానికి ప్రయత్నించాము, ఈ పాత కొత్తల సమ్మేళనంలో ఫ్యూజన్ మ్యూజిక్ లా తయారయింది నేటి మీ పరిస్థితి. ఆ ఫ్యూజన్ లోంచి కన్ ఫ్యూజన్ మొదలయింది, ఎందుకంటే ప్రతీ దానికీ మీకు ఎంచుకోవడానికి ఎన్నో ఆప్షన్స్ ఉన్నాయి, దాన్ని సరి అయిన దిశగా వాడుకోవాలి కానీ మిస్ యూజ్ చేసుకోవద్దు. అవినాష్ కు నీకు అభిరుచులు, అభిప్రాయాలు కలిశాయి అనుకున్నారు కానీ కలిసి జీవించగలము అన్న నమ్మకం మాత్రం లేదు. రచిత్ కి నీకు మధ్య చిన్న చిన్న తేడాలున్నాయి, అందువల్ల మేము కలిసి నడవలేమేమో అన్న అనుమానం ఉంది. ఈ రెండింటిలో ఏది బలంగా ఉంది? ఎందుకుంది? అనేది విశ్లేషించుకో, దాన్ని బట్టి నిర్ణయించుకో నీ భవిష్యత్తు." ఎన్నడూ లేనిది చాలా స్థిరంగా, కోపంగా మాట్లాడుతున్న అమ్మని వింతగా చూసింది శిరి.

"నేను కూడా ఇదే ఆలోచిస్తున్నానమ్మా," అని ఇంకా ఏదో చెప్పబోతున్నదల్లా, మోగుతున్న తన ఫోన్ చూసి

" ఒన్ మినిట్ అమ్మా, రచిత్ దగ్గరనించి ఫోన్, నిన్న కూడా చేశాడు నేను ఆన్సర్ చెయ్యలేదు" అంది ఫోన్ తీసుకుని బాల్కనీలోకి వెళుతూ.

" తన మనసుకి నచ్చిన జవాబు దొరికింది" అనిపించింది రాధకి...

●●●

Click here to share your comments on this story